క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుజాత దర్శించుకున్నారు. ఆలయ అధికారులు న్యాయమూర్తికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆలయ అధికారులు ఉన్నారు. కార్యక్రమంలో సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్‌ఐ రామ్మోహన్, ఏఈఓలు హరిమాధవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి ఉద్యోగోన్నతి



మేయర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు పీహెచ్ మేస్త్రీలుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ అరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.బాబు, కె.చినబాబు అనే ఇద్దరు ఉద్యోగులకు గురువారం మేయర్ అముద పదోన్నతి పత్రాలు అందజేశారు.

నేడు దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక శిబిరం

ఐరాల: చిత్తూరు నగరంలోని తపోవనంలో శుక్రవారం దివ్యాంగులకు ఉచిత కృత్రిమ కాలు కొలతలు తీసుకొనే ప్రత్యేక శిబిరాన్ని దివ్యాంగులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గురువారం మండలానికి చెందిన ఏపీ నిరుద్యోగ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్లతో పాటు వైకల్యం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94403 57522, 62814 86722ను సంప్రదించాలని ఆయన కోరారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన డీఆర్‌ఓ



పాత కలెక్టరేట్‌లో రికార్డు రూమును పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గిరింపేటలో ఉన్న పాత కలెక్టరేట్‌ను డీఆర్‌ఓ పుల్లయ్య ఆకస్మికంగా గురువారం పరిశీలించారు. పాతకలెక్టరేట్ ఆవరణలో ఉన్న పలు కార్యాలయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాత కలెక్టరేట్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు. పోలీసు సెక్యూరిటీ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అక్కడే ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా పాత రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన భవనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాలుకు దరఖాస్తులు

గుడుపల్లె: విభిన్న ప్రతిభావంతులు కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకునేందుకు నేడు శుక్రవారంలోపు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపి తెలిపారు. చెన్నైలోని ఫ్రీడమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల క్యాంపులో కాలు కొలతలను తీసుకుని 20 రోజుల తరువాత వారికి రూ.51 వేల విలువ చేసే వెయిట్ లెస్ కృత్రిమ కాలును ఉచితంగా అమర్చుతారన్నారు. దరఖాస్తులు చేసుకునే ప్రతిభావంతులు ఆధార్, రేషన్ కార్డు, సదరన్ సర్టిఫికెట్ రెండు జిరాక్స్ సెట్లు, వికలత్వం కనిపించే రెండు ఫొటోలు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తవణంపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తవణంపల్లి ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం... మండలంలోని కాణిపాకం సమీపంలో బైపాస్ సర్వీస్‌రోడ్డులో ఈ నెల 23న గుర్తు తెలియని వ్యక్తి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొందింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి తీవ్రగాయాలవడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శవ పరీక్ష నిర్వహించి వీఆర్వో శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి గురించి తెలిసిన వారు తవణంపల్లె పోలీసులను సంప్రదించాలని కోరారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

- రసాయన ఎరువుల్లో ఉండే పోషకాల లభ్యం
- భూసారంతోపాటు అధిక దిగుబడులు

ఐరాల: పంట భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం, వర్షపు నీటిని గ్రహించే సామర్థ్యం తగ్గుతుండడంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూ సారం హరించుకుపోతోంది. ఈ నేపథ్యంలో రైతులు చెరువు మట్టిని పొలాలకు విరివిగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటిపోయింది. ఆయా చెరువుల్లోని మట్టిని పంట భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మండలంలో రైతులు 19,248 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. మెట్ట పంటలు 15,400 ఎకరాల్లో సాగవుతున్నాయి. నీటి తడులు అవసరం ఉన్న పంటలు 3,800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా మామిడి, వేరుశనగ, వరి, పశుగ్రాసం, కంది, అలసందలు, కూరగాయలు, పూల తోటలను సాగు చేస్తున్నారు.

మట్టి తరలిస్తే అనుకూలం

మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోయాయి. ఎండిన చెరువుల్లో 2 అడుగుల నుంచి 3 అడుగుల మేర పేరుకు పోయిన మట్టిని పంటభూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. జేసీబీలు, ట్రాక్టర్లతో తక్కువ ఖర్చుతో రైతులు మట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. తర్వాత నాగలితోపాటు రొటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంటసాగుకు అనుకూలంగా మారుతుంది.

మట్టి సేకరణ విధానం

చెరువు మట్టి పూడిక స్థాయి, లోతు, విస్తీర్ణం గమనించాలి. దాన్ని తీయడం వల్ల చెరువుకు ఉపయోగం ఉందా లేదా అని గమనించాలి. చెరువు మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించేందుకు మట్టి పరీక్షలు చేయించాలి. ఈ పరీక్షల్లోనే ఆ మట్టిలోని రసాయన అవశేషాల స్థాయిని కూడా తెలుసుకోవాలి.



చెరువు మట్టిని ట్రాక్టర్ ద్వారా పొలానికి తరలిస్తున్న రైతు



జేసీబీతో చెరువు మట్టిని ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న దృశ్యం

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తయిన ప్రదేశాల నుంచి వర్షపు నీటితోపాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రుమట్టి, వివిధ పాళ్లలో కుళ్లి వ్యర్థ పదార్థాలతో కలిసి చెరువులోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు సూక్ష్మపోషకాలు ఉంటాయి. చెరువు మట్టి వల్ల పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి, అధిక దిగుబడులు సాధించవచ్చు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది. విలువైన సేంద్రియ కర్బన పదార్థం అందివ్వడంవలన మొక్కలు నీటి ఎద్దడిని కూడా తట్టుకుని దిగుబడులనిస్తాయని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి తెలిపారు. చెరువు మట్టి వేసిన పంటల్లో దిగుబడులు ఆశించిన మేర వస్తాయని పరిశోధనలో వెల్లడైనట్టు వివరించారు.

ప్రయోజనాలు ఇలా..

చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు. నేల గుల్లబారుతుంది. మురుగు నీటి పారుదల మెరుగవుతుంది. సూక్ష్మ, స్థల పోషకాల స్థాయిలు పెరుగుతుంది. ముఖ్యంగా నత్రజని స్థాయిలు పెరుగుతాయి. మట్టితోపాటు సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. ఈ మట్టితో సూక్ష్మ జీవులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలలో గాలి పరిమాణాన్ని పోషకాలను పెంచుతాయి. అన్ని రకాల పోషకాలను అందిస్తూ దీర్ఘకాలికంగా పంట పొలం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. ప్రతి పంటలోనూ అధిక దిగుబడులు సాధించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నారు



చెరువు మట్టి పొలాల్లో వేసుకోవడం వల్ల కలిగే లాభాలను వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం మా పొలాల్లో చెరువు మట్టి పోసుకుంటున్నాం. చెరువు మట్టితో అధిక దిగుబడులు సాధించవచ్చు. గుల్లబారిన భూమిలో మొక్కలు లోతుగా చొచ్చుకుపోతాయి. ఈ మట్టి మూడేళ్ల వరకు పనిచేస్తుందని వ్యసాయాధికారులు చెబుతున్నారు.

–విజయ్‌కుమార్, వినాయకపురం, ఐరాల

సేంద్రియ పద్ధతుల్లో సాగు



పొలాల్లో చెరువు మట్టిని ఉపయోగిస్తూ పంటలను సేంద్రియ పద్ధతుల్లో పండించికోవచ్చు. రసాయన ఎరువులకు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పంటలు పండించుకునే వీలుంటుంది. వర్షాధార నేలల్లో వీటిని ఎక్కువగా వేస్తుంటారు. గత మూడేళ్లుగా పొలాలకు చెరువు మట్టిని తరలిస్తున్నాం. దీంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి.

–హరిరెడ్డి, రైతు మట్టపల్లె, ఐరాల

రైతులు చెరువు మట్టిని వేసుకోవాలి



చెరువు మట్టిలో రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలన్నీ సమృద్ధిగా లభిస్తాయి. అవకాశం ఉన్నంత వరకు చెరువు మట్టిని రైతులు పంట పొలాలకు వినియోగించడం మంచిది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువులు అడుగంటాయి. విరివిగా మట్టి లభ్యమవుతున్న దృష్ట్యా పొలాలకు వినియోగించుకుంటే అధిక దిగుబడులు పొందేందుకు వీలుంటుంది.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగుచేసి బెల్లం తయారు చేస్తే టీటీడీకి సరఫరా చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో చేసిన చెరకు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు, వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు.

సేంద్రియంతో అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం: సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి జే.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మంగుంట గ్రామంలో పొలంబడి కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ హాజరయ్యారు. రైతులతో ఆయన మాట్లాడుతూ లాభసాటి దిగుబడి సాధించాంటే వేపగింజల కషాయం, కానుగ ఆకుల కషాయం, జీవామృతం వంటి పిచికారీ ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులు సకాలంలో తీయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో గురువారం బిల్లురీడర్స్‌తో సమావేశమయ్యారు. ప్రతి నెలా 8వ తేదీ లోపు విద్యుత్ రీడింగ్‌ను పూర్తి చేయాలన్నారు. రీడింగ్ సమయంలో ఇల్లు తాళం వేసి ఉంటే మరోసారి రావడం లేదా వినియోగదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని సూచించారు. అలాగే మీటర్లు మరమ్మతులై ఉంటే వాటిని బాగు చేసి పాత, ప్రస్తుత రీడింగ్‌లు కలిపి వినియోగదారుడికి వాటి గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వారితో మర్యాదగా మాట్లాడుతూ సంస్థ గురించి అడిగే సందేహాలను తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇటీవల యూపీఐ యాప్స్‌లో కరెంటు బిల్లు చెల్లించే విధానం ఆపివేశారన్నారు. ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో చెల్లించే అవకాశం కల్పించారన్నారు. కానీ పలువురికి వీటిపై అవగాహన లేదన్నారు. క్షేత్రస్థాయిలో వీటి గురించి తెలియజేస్తే వారికి అర్థమవుతుందని చెప్పారు. నిర్ణయించిన మార్గాల్లో సమయం ప్రకారం రీడింగ్స్ తీసి పూర్తి చేయాలన్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి జరిమానా లేకుండా చెల్లించే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో డీఈలు జ్ఞానేశ్వర్, శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

యాదమరి(పూతలపట్టు): మండలంలోని సంతగేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కాన్పులు ఎక్కువ మొత్తంలో ఆరోగ్య కేంద్రంలో చేయాలని వైద్యాధికారికి సూచించారు. ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించి, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే రోగులకు నాణ్యమైన వైద్యను అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న లెప్రసీ సర్వేను పరిశీలించారు. వ్యాక్సిన్ సర్వే జరిగే విధానాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల టీబీ వ్యాధి రాకుండా ఉంటుందని ప్రజలకు తెలియజేశారు. వీరి వెంట వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆడి ప్రత్యేక అభిషేకాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని అమ్మవారి ఆలయాల్లో నేడు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆడి నెల రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని సంతపేట, మురకంబట్టు, ఇందిరానగర్, ఆటోనగర్, తిమ్మసముద్రంలోని నాగాలమ్మ ఆలయాల్లో జాతర నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించనున్నారు. రాత్రికి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని జాతర పెద్దలు తెలిపారు.

అబ్బురపరిచిన గణిత అష్టావధానం



అవధానంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్: సర్కారు బడిలో చదివే విద్యార్థులు నిర్వహించిన గణిత అష్టావధానం అబ్బురపరిచిందని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, గణిత ఫోరంల సంయుక్త నిర్వహణతో గురువారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గణితావధానం తిలకించే విద్యార్థుల్లో ఆలోచనా విధానం మారుతుందని తెలిపారు. గణితావధాని అరుణశివప్రసాద్ మాట్లాడుతూ బంగారుపాళ్యం మండలం జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థుల బృందం ఎన్నో గణిత అష్టావధానం కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. అనంతరం గణిత అష్టావధానంలో పాల్గొన్న విద్యార్థులు తమదైన శైలిలో డిగ్రీ కళాశాల విద్యార్థులను అబ్బురపరిచారు. పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక కార్యదర్శి సుధాకర్, లయన్స్‌క్లబ్ సభ్యులు శ్రీధర్, పాపుదేశి ఫౌండేషన్ సభ్యులు జయంతి, మొగిలయ్య, కళాశాల అధ్యాపక బృందం డా.జి.ఉషారాణి, రమాదేవి, వినీల, గంగారాం, కౌసర్‌జహాబేగం, ధర్మమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం





వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ సంధ్య, రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుడిపాల, బొమ్మసముద్రం పీహెచ్‌సీల వైద్యాధికారులు సంధ్య, అనూష అన్నారు. చుక్కావారిపల్లె, 197రామాపురం గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాలకు వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 110 మంది గర్భిణులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, అనిత, శివగామి, సరస్వతి, దివ్య, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సేద్యం.. 30 శాతం!

- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- పెట్టుబడి సాయంపై సర్కారు మౌనం
- ఆందోళనలో రైతాంగం
- పంటల సాగు అంతంతమాత్రమే

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలరోజులైనా పెట్టుబడి సాయం గురించి పట్టించుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఇంతవరకు ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు మరిన్ని కష్టాలు తప్పవేమోనని రైతులు ఆందోళన వెంటాడుతోంది. ఫలితంగా సాధారణ సాగు విస్తీర్ణంలో ఈ సారి 30 శాతం మాత్రం సాగవుతోంది.

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు డివిజన్ పరిధిలో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఖరీఫ్ సీజను పంటల సాగుకు ముందస్తుగా పెట్టుబడి సాయం అందివ్వడంలో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. కేవలం వర్షాధార పంటగా వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సాధారణ విస్తీర్ణంలో కేవలం వేరుశనగ మినహా ఇతర పంటలు మొత్తం 30 శాతం మేరకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు. చిత్తూరు డివిజన్ పరిధిలో చిత్తూరు, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలు వస్తాయి. ఈ మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. అడపాదడపా కురిసిన వర్షానికి మాత్రమే రైతులు కొంతమేరకు పంటలను సాగులోకి తీసుకు రాగలిగారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ సీజను ప్రారంభంలోనే రైతు భరోసా పథకం కింద పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని అందించేది. దీంతో రైతులు పంటల సాగును ఉత్సాహంగా చేపట్టేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందించేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించిన పీఎం కిసాన్ కింద ప్రతి రైతుకు రూ.2 వేలు మాత్రమే చేతికందింది. దీంతో రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. ఫలితంగా మొత్తం సాధారణ విస్తీర్ణంలో కేవలం 30 శాతం మేరకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు.

చిత్తూరు డివిజన్ పరిధిలో సాగు ఇలా....

మొత్తం సాగు విస్తీర్ణం	-	25,984 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	8,838 హెక్టార్లు
వేరుశనగ సాగు విస్తీర్ణం	-	15,833 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	4,198 హెక్టార్లు
ఇతర పంటల సాగు విస్తీర్ణం	-	10,151 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	4,640 హెక్టార్లు
సాగుకు నోచుకోని విస్తీర్ణం	-	17,146 హెక్టార్లు



గుడిపాలలో వరినాట్లు వేస్తున్న మహిళలు

సాగు ఇలా...

డివిజన్ పరిధిలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 25,984 హెక్టార్లకు గాను ప్రస్తుతం 8,838 హెక్టార్ల మేరకు మాత్రమే రైతులు అన్ని రకాల పంటలను సాగు చేశారు. అందులో అత్యధికంగా వర్షాధార పంటగా వేరుశనగను మొత్తం 15,833 హెక్టార్లకు గాను 4,198 హెక్టార్లలో, వరి 1,847 హెక్టార్లకు గాను 723 హెక్టార్లలో, చెరకు 3,180 హెక్టార్లకు గాను 1,074 హెక్టార్లలో సాగు చేయగా ఇతర పంటలను 2,843 హెక్టార్లలో సాగు చేశారు. దీన్ని బట్టి చూస్తే కేవలం వర్షాధార పంటగా వేరుశనగను మాత్రమే అత్యధికంగా సాగులోకి తీసుకువచ్చారు. సాగు నీటి ఆధారిత పంటలను అంతంత మాత్రంగానే సాగు చేశారు.

కొత్త రుణాల జాడేది?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం నెలకొంది. ఈ కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. చాలా మంది ఈ అధిక వడ్డీల భారం మోయలేక అసలు వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. మరి కొందరు రైతన్నలు ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ పెట్టుబడి సాయం అందించడంలో చూపించలేదు. దీంతో అన్నదాతకు గడ్డుకాలం ఎదురవుతోంది.



పెనుమూరు మండలంలో సాగవుతున్న చెరకు పంట



కార్వేటినగరం మండలంలో వేరుశనగ పంట సాగు